సాక్షి
జోగుళాంబ గద్వాల

మంగళవారం । 6 । మే । 2025



ఆధునిక సాగుకు ఆసక్తి
ప్రస్తుతం రైతులు ఆధునిక యంత్రాలతో సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

వివరాలు 8లో ▸



కొనుగోలులో కొర్రీలు
వరిధాన్యం కొనుగోలులో కొర్రీలను నిరసిస్తూ రైతులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
42.0 /20.6

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

‘ప్రజావాణి’కి 53 ఫిర్యాదులు



గద్వాల: వివిధ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై 53 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపించడం జరిగిందని వాటిని వెంటనే పరిష్కరించాలని, పరిష్కారం కానిపక్షంలో అందుకు గల కారణాలు వివరిస్తూ సంబంధిత ఫిర్యాదుదారుడికి అక్నాలెడ్జ్‌మెంట్ ద్వారా తెలియజేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఏవో నరేందర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 8 అర్జీలు

గద్వాల క్రైం: సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 8 ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గద్వాలలో ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్‌గా చూపించి రూ.20లక్షలు మోసం చేశాడని, న్యాయం చేయాల్సిందిగా రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి ఫిర్యాదు చేశాడు. అలాగే, గట్టు మండలానికి చెందిన ఇద్దరు రైతులు భూ వివాదంపై తరచూ ఘర్షణ చోటు చేసుకుంటుందని, వారి నుంచి రక్షణ కల్పించాల్సిందిగా ఎస్పీ దృష్టికి రైతులు వివరించారు. ఇలా పలువురు బాధితులు పలు సమస్యలపై ఎస్పీకి విన్నవించారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ఈ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలో షెడ్యూల్ విడుదల చేస్తామని పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సులకు సంబంధించి రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ పరీక్షలు బుధవారం (మే 6) నుంచి జరగాల్సి ఉంది. ప్రభుత్వం కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్య సంఘాలు.. సోమవారం నుంచి డిగ్రీ కళాశాలలు బంద్ చేసి, ఆందోళనకు దిగిన నేపథ్యంలో పీయూ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

రేపు జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఈనెల మూడో వారంలో మంచిర్యాల జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ఎంపికలను ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు సభ్యులు నాగరాజు, రాఘవేందర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగతా వివరాల కోసం 99590 16610, 99592 20075 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

స్వయం ఉపాధికి కార్పొరేషన్ల తోడ్పాటు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్వయం ఉపాధికి కార్పొరేషన్లు ఎంతో దోహదపడుతాయని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. మహబూబ్‌నగర్ షాసాబ్ గుట్ట ముస్లిం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెహందీ, కంప్యూటర్ కోర్సులు పూర్తిచేసిన మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించేవిధంగా కార్పొరేషన్లు చేయూత అందిస్తాయని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ తరపున స్కిల్‌డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించి శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, మెహందీ, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి రుణాలు మంజూరవుతాయని అన్నారు.

హద్దు దాటుతున్నారు!

తుంగభద్ర నది నుంచి ఇసుక తోడే విషయంలో ముదురుతున్న వివాదం

తూర్పు గార్లపాడు శివారులో కర్నూల్-గద్వాల మధ్యలో వివాదానికి కేంద్రంగా మారిన సరిహద్దు



- జిల్లా సరిహద్దులోకి వచ్చి ఇసుక తోడుతున్న ఏపీ ప్రాంతంవారు
- ఉచితం పేరుతో ప్రకృతి వనరులను కొల్లగొడుతున్న ఇసుక మాఫియా
- జిల్లా ట్రాక్టర్ యజమానులపై ఏపీ అధికారుల కేసులు, బెదిరింపులు
- నోరు మెదపని జిల్లా అధికారులు

రాజోళి: తుంగభద్ర నది నీటి కోసం గతంలో రెండు ప్రాంతాల వారు ఘర్షణ పడిన సంగతి తెలిసిందే. అప్పటి అధికారులు, యంత్రాంగం ఆ సమస్యపై పెద్దగా స్పందించకపోవడంతోనే ఘర్షణ జరిగిందని నాటి ప్రత్యక్ష సాక్ష్యులు నేటికి చెబుతుంటారు. ప్రస్తుతం అదే ప్రాంతాల నడుమ మరో సమస్యపై వివాదం ముదురుతోంది. గతంలో తుంగభద్రలో నీటి కోసం కాగా.. ఇప్పుడు కూడా అదే నదిలో ఇసుక కోసం వివాదం జరుగుతుంది. ఇప్పుడు కూడా అధికారులు మౌనంగా ఉండటంతో జిల్లాకు నష్టం వాటిల్లుతుందని, జిల్లా ప్రయోజనాలను మరిచి ఏపీ అధికారుల తీరుపై కనీసం నోరు మెదపకపోవడంపై జిల్లా ప్రజలు కూడా ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రెండు ప్రాంతాల నడుమ ఒకే నది

రాష్ట్రంలోని గద్వాల జిల్లా.. ఏపీలోని కర్నూల్ జిల్లాలో తుంగభద్ర నది ప్రవహిస్తుంది. ఈ క్రమంలో నదిలో నీటిని కలిసి తాగుతున్నామని, అందులో ఉన్న వనరులను పంచుకునే క్రమంలో పరిమితులు విధిస్తూ ఒక ప్రాంతం వారికి అన్యాయం చేయడం తగదని జిల్లా వాసులు అంటున్నారు. రెండు ప్రాంతాల మధ్య ఉన్న ఒకే నది ద్వారా ఎలాంటి వివాదాలు లేకుండా చూడాల్సిన అధికార పార్టీలే ఈ సమస్యను పరిష్కరించకుండా వదిలేస్తే ముమ్ముందు సమస్య తీవ్రత పెరిగే అవకాశముందని జిల్లా వాసులు అంటున్నారు.

ప్రకృతి వనరులపై అజమాయిషీ

జిల్లాలో నది తీర గ్రామాల్లో భాగంగా రాజోళి మండలం తూర్పు గార్లపాడు, చిన్నధన్వాడ, మానవపాడు మండలంలోని మద్దూరు గ్రామాల్లో మన ఇసుక వాహనాలు నడుస్తుండగా.. జిల్లాలోని తుంగభద్ర నది పరివాహక గ్రామాల్లోని ఏపీ వైపున నుంచి ఈ గ్రామాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తుమ్మిళ్ల గ్రామంలో నేటికి మర బోట్ల ద్వారా ఇసుకను జిల్లా సరిహద్దులోకి వచ్చి తీస్తున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. కానీ ఇప్పటికే తూర్పు గార్లపాడులోని ఇసుక రీచ్‌కి వెళ్లిన జిల్లా ట్రాక్టర్లపై ఏపీ అధికారులు రెండు సార్లు కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఇలా ప్రకృతి వనరులపై అజమాయిషీ చేస్తున్నా.. రోజురోజుకు వివాదం ముదరుతున్నా అధికార పార్టీ, ప్రభుత్వ పెద్దలు నోరుమెదపకపోవడం, చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు, ఇరు ప్రాంతాల అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపాలని, లేకపోతే వివాదం మరింత ముదిరే ప్రమాదముందని జిల్లా వాసులు అంటున్నారు. ఇదిలాఉండగా, నదిలో నెలకొన్న సమస్యను జిల్లా మైనింగ్ శాఖ అధికారి దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేయగా.. పలుమార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు. ■

ఉచితం పేరుతో దందా

ఇదిలా ఉండగా ఏపీలో ఉచిత ఇసుక పేరుతో కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటితోపాటుగా నది పరివాహకంలోని అన్ని గ్రామాల్లో ఇసుకను తోడి ఉచితం పేరుతో టిప్పర్లలో తరలించి దందాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు ఉంటే రాత్రిళ్ల సమయంలో ఇసుక రవాణా చేయాల్సిన పరిస్థితి ఏంటనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఉచితం ఏపిలో మాత్రమే ఉండగా, ఏపి నుంచి తెలంగాణలోకి వాహనాలు రావడం ఏంటని, దాని వెనుక ఎవరున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నదిలోకి వెళ్లగానే హద్దు పేరుతో దాడులు చేసి కేసులు, జరిమానాలు విధించే, ఏపి అధికారులు హద్దులు దాటి వచ్చి దందాలు చేస్తున్న ఏపీ వాహనాలు ఎందుకు కనిపించడం లేదని జిల్లా వాసులు అంటున్నారు. ఏపీ వాహనాలు జిల్లాలో చేస్తున్న దందాను జిల్లా అధికారులు కూడా ఎందుకు పట్టించుకోవడం లేదని అంటున్నారు.

ఏం జరుగుతుందంటే..

జిల్లాలో ఇసుక అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం మన ఇసుక వాహనం పేరుతో కొన్ని ట్రాక్టర్లకు అనుమతులిచ్చింది. అయితే వారు ఆన్‌లైన్‌లో తమ ట్రాక్టర్‌ను నమోదు చేసుకునేందుకు కొంత నగదును ప్రభుత్వానికి చెల్లించడంతో పాటు ఇసుకను ప్రజలకు అందించే క్రమంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఇసుకను అందిస్తున్నారు. ఈ క్రమంలో వారికి నష్టాలు కూడా తప్పడం లేదు. కాగా నదిలో ఇసుక కూడా తక్కువగా ఉండటంతో ఎక్కడ లభ్యత ఉంటే అక్కడికి వెళ్లి ఇసుకను తీసుకుంటున్నారు. కానీ కర్నూల్ జిల్లా అధికారులు నదిలోకి వెళ్తున్న గద్వాల జిల్లా ట్రాక్టర్లను తమ హద్దులోకి వచ్చారనే నెపంతో బెదిరించడం, ఫొటోలు తీసుకోకుండా ఫోన్‌లు లాక్కోవడం, జరిమానాలు విధించడం చేస్తున్నారు. కానీ ఏపీకి చెందిన ట్రాక్టర్లతోపాటు నదిలో నీరున్న సమయంలో నేరుగా స్టీమర్లు జిల్లా సరిహద్దులోకి వచ్చి ఇసుకను తోడుతున్నా ఇక్కడి జిల్లా అధికారులు ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా నదిలో అష్టకష్టాలు పడి నదిలో ఇసుకను లోడ్ చేసుకుని వస్తున్న అనుమతి ఉన్న ట్రాక్టర్లపై రాజకీయ కక్ష్యలతో కేసులు నమోదవుతున్నాయి. దీంతో ట్రాక్టర్ల యజమానులు ఇసుక వాహనాలను నడిపేందుకు జంకుతున్నారు. నదిలో దిగితే ఏపీ అధికారుల బెదిరింపులు, బయటకు వస్తే జిల్లా అధికారులు నానా కారణాలతో కేసులు చేస్తున్నారని ట్రాక్టర్ల యజమానులు అంటున్నారు. రోడ్ టాక్స్, ప్రభుత్వానికి ఆన్‌లైన్ కోసం టాక్స్ ఇతర అన్ని పన్నులు చెల్లిస్తున్నా తమకు అండగా ఉండటం వదిలేసి ఏపీ అధికారులతో సమానంగా కేసులు చేయడం దారుణమని అంటున్నారు.



సరిహద్దును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ నారాయణ (ఫైల్)

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



గోపల్‌దిన్నెలో రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

ఇటిక్యాల: భూ సమస్యలను పరిస్కరించేందుకుగాను ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బి.ఎం సంతోష్ అన్నారు. సామవారం మండలంలోని గోపల్‌దిన్నెలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టుగా మండలాన్ని ఎంపిక చేశారని, భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని దరఖాస్తులు సమర్పించాలని, అధికారులు స్వయంగా గ్రామాలకే దరఖాస్తులను పరిశీలించి, అర్హతను నిర్ధారించిన తర్వాత వారికి సంబంధింత ఉత్తర్వులు జారీ చేస్తారని తెలిపారు. మీసేవ కేంద్రాలలో దరఖాస్తు ఫీజు ఉంటుందని, ఈ రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పూర్తిగా ఉచితంగా స్వీకరించబడుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను నెల రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

అనంతరం కలెక్టర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పనులు సకాలంలో పూర్తి అయ్యేందుకు పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. గ్రామంలో మొత్తం 55 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా ఇప్పటికే 8 ఇళ్లకు బేస్‌మెంట్ పూర్తికాగా ముగ్గురికి మొదటి విడతగా రూ.1లక్ష వచ్చినట్లు తెలిపారు. ఇళ్ల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ.. లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం వెంటనే అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, హౌసింగ్ పీడీ శ్రీనివాసులు, తహశీల్దార్‌లు వీర భద్రప్ప, నరేష్, ఎంపీడీఓ అజార్ మొహినుద్దీన్, ఎఓ రవికుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

గద్వాల: వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో తాగునీటి అంశంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలవకుండా అవసరమైన మందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వచ్చే నెలరోజులు చాలా కీలకమని అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను గుర్తించి అవసరమైన మరమ్మతు చేపట్టి ప్రతిఇంటికి తాగునీరు అందించే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అవసరమైన బల్క్‌వాటర్ సరఫరా, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, చేతిపంపులు, ప్రైవేటు బోరువెల్స్, ట్యాంకర్లు తదితర అన్ని వనరులను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. నీటి డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే, డీఎం, ఎఫ్‌టీ నిధు లతో పనులను చేపట్టాలన్నారు. గ్రామంలో ఎక్కడైనా నీటికొరత కనిపించిన వెంటనే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరాల చేయా లని డీపీవో ఆదేశించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో మిషన్‌భగీరథ ఎస్‌ఈ వెంకట్‌రమణ, ఈఈ పరమేశ్వరి, శ్రీధర్‌రెడ్డి లు పాల్గొన్నారు.

పారా బాయిల్డ్‌లో భారీ అగ్నిప్రమాదం

- వనపర్తి జిల్లా పెబ్బేరులో ఘటన

వనపర్తి: పెబ్బేరు పట్టణ శివారులోని సాయిగోపాల్ పారా బాయిల్డ్ మిల్లులో సోమవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారి-44కు సమీపంలోని మిల్లులో సాయంత్రం ఎవరూ లేని సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి.. గన్నీ బ్యాగులు, ధాన్యం బస్తాలు, మర ఆడించిన బియ్యం పెద్దమొత్తంలో దహనమైనట్లు మిల్లు యజమాని తెలిపారు. మిల్లులో పనిచేసేవారు టీ తాగేందుకు బయటకు వెళ్లిన సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగగా.. గమనించిన వారు వెంటనే మంటలు ఆర్పేందుకు ప్రయత్నించడంతోపాటు కొత్తకోట అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో రెండు వాహనాలు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేసినా.. రాత్రి వరకు మంటలు అదుపులోకి రాలేదు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 కోట్లకుపైగా నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

పారా బాయిల్డ్ మిల్లులో చెలరేగుతున్న మంటలు



స్పందన అంతంతే

- మే 3తో ముగిసిన ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు
- మూడుసార్లు గడువు పెంచినా నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో రూ.67.33 కోట్ల ఆదాయం
- అత్యధికంగా మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు రూ.18.08 కోట్లు..
- అలంపూర్ మున్సిపాలిటీకి రూ.16 లక్షలు మాత్రమే..



ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం ఇలా...

జిల్లా	మున్సిపాలిటీలు	ఆదాయం (రూ.కోట్లలో)
మహబూబ్‌నగర్	4	28.84
నాగర్‌కర్నూల్	4	13.58
జోగుళాంబ గద్వాల	4	4.58
వనపర్తి	5	11.42
నారాయణపేట	4	8.91

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)కు పెద్దగా స్పందన రాలేదు. అనధికార లేఔట్లలోని స్థలాను క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన 25 శాతం రాయితీ గడువు ముగిసినా.. అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. మూడు సార్లు గడువు పెంచినా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు యజమానులు పెద్దగా ముందుకు రాలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలోని మొత్తం 21 పురపాలికల్లో కలిపి కేవలం రూ.67.33కోట్ల ఆదాయం సమకూరింది. రాష్ట్ర ప్రభుత్వం మొదట ఈ ఏడాది మార్చి 31లోగా చెల్లించే వారికి మొత్తం ఫీజులో 25 శాతం రాయితీ ప్రకటించింది. అయితే ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో ఈ గడువును ఏప్రిల్ 30 వరకు, మళ్లీ ఈనెల 3వ తేదీ వరకు ఇలా మూడుసార్లు పెంచింది.

పురపాలికల వారీగా ఆదాయం ఇలా..

■ మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో 32,005 దరఖాస్తులు రాగా.. వీటిలో ఎల్‌ఆర్‌ఎస్‌కు అర్హత కలిగిన 22,183కి ఫీజు చెల్లించాలని మున్సిపల్ అధికారులు నోటీసులిచ్చారు. ఇందులో 7,424 మంది దరఖాస్తుదారులు రూ.18.08 కోట్లు చెల్లించగా..ఇప్పటివరకు 2,910 మందికి ప్రొసీడింగ్స్ అందాయి. జడ్చర్ల పరిధిలో 17,935 దరఖాస్తులు రాగా.. అర్హత కలిగిన 11,071కి ఫీజు చెల్లించాల్సి ఉంది. ఇందులో 2,933 మంది దరఖాస్తుదారులు రూ.6.40 కోట్లు చెల్లించారు. ఇప్పటివరకు 847కి మాత్రమే ప్రొసీడింగ్స్ అందాయి. భూత్పూర్‌లో 6,341 దరఖాస్తుల్లో 4,703కి ఫీజు చెల్లించాల్సి ఉంది. 1,375 మంది దరఖాస్తుదారులు రూ.2.67 కోట్లు చెల్లించగా.. 651కి ప్రొసీడింగ్స్ అందాయి. దేవరకద్ర పరిధిలో 6,765 దరఖాస్తులకు 6,699కి ఫీజు చెల్లించాల్సి ఉంది. 1,036 మంది రూ.1.69 కోట్లు చెల్లించారు. 63 మందికే ప్రొసీడింగ్స్ అందాయి.

■ వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో 29,450 దరఖాస్తులు రాగా.. 25,827కి ఫీజు చెల్లించాల్సి ఉంది. 5,214 మంది దరఖాస్తుదారులు రూ.6.40 కోట్లు చెల్లించారు. 2,766 మందికే ప్రొసీడింగ్స్ అందాయి. పెబ్బేరులో 7,432 దరఖాస్తులు రాగా అర్హత కలిగిన 6,484 కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 1,561 మంది రూ.1.88 కోట్లు చెల్లించారు. ఇప్పటివరకు 417 మందికే ప్రొసీడింగ్స్ అందాయి. కొత్తకోటలో 7,740 దరఖాస్తులు రాగా 7,318కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 1,355 మంది రూ.1.60 కోట్లు చెల్లించారు. ఇప్పటివరకు 63 మందికే ప్రొసీడింగ్స్ అందాయి. ఆత్మకూరులో 3,827 దరఖాస్తులకు 3,150కి ఫీజు చెల్లించాల్సి ఉంది. 822 మంది రూ.98 లక్షలు చెల్లించగా..623 మందికే ప్రొసీడింగ్స్ అందాయి. అమరచింతలో 619 దరఖాస్తుల్లో 333కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 164 మంది రూ.56 లక్షలు చెల్లించారు. ఇప్పటివరకు 121 మందికే ప్రొసీడింగ్స్ అందాయి.

■ నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో 16,266 దరఖాస్తులు రాగా 10,782 కి ఫీజు చెల్లించాల్సి ఉంది. 2,895 మంది రూ.4.78 కోట్లు చెల్లించగా..1,728 మందికే ప్రొసీడింగ్స్ అందాయి. కల్వకుర్తిలో 11,643 దరఖాస్తులు రాగా 9,491 కి ఫీజు చెల్లించాల్సి ఉంది. ఇందులో 2,160 మంది రూ.4.85 కోట్లు చెల్లించారు. 1,088 మందికి ప్రొసీడింగ్స్ అందాయి. కొల్లాపూర్‌లో 4,654 దరఖాస్తులకు 3,718కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 713 మంది రూ.1.23 కోట్లు చెల్లించారు. 264 మందికే ప్రొసీడింగ్స్ అందాయి. అచ్చంపేటలో 12,291 దరఖాస్తులకు 10,765కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 1,871 మంది రూ.2.72 కోట్లు చెల్లించారు.106 మందికే ప్రొసీడింగ్స్ అందాయి.

■ నారాయణపేటలో 7,154 దరఖాస్తులలో 2,036కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 1,639 మంది రూ.4.19 కోట్లు చెల్లించారు. 772 మందికే ప్రొసీడింగ్స్ అందాయి. మక్తల్‌లో 10,616 దరఖాస్తులకు 9,063కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 1,288 మంది రూ.2.44 కోట్లు చెల్లించారు.599 మందికే ప్రొసీడింగ్స్ అందాయి. కోస్గి పరిధిలో 4,168 దరఖాస్తులు రాగా 1,987కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 965 మంది రూ.1.94 కోట్లు చెల్లించారు. 135 మందికే ప్రొసీడింగ్స్ అందాయి. మద్దూరులో 322 మంది రూ.34 లక్షలు చెల్లించారు.

■ గద్వాల పట్టణ పరిధిలో 14,607 దరఖాస్తులు రాగా 4,000కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 1,844 మంది రూ.2.96 కోట్లు చెల్లించారు. 927 మందికే ప్రొసీడింగ్స్ అందాయి. అయిజలో 10,166 దరఖాస్తులు రాగా అర్హత కలిగిన 5,244కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 1,155 మంది రూ.1.47 కోట్లు చెల్లించారు. 689 మందికే ప్రొసీడింగ్స్ అందాయి. అలంపూర్‌లో 431 దరఖాస్తులే రాగా 366కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 122 మంది కేవలం రూ.16 లక్షలే చెల్లించారు. 64 మందికి ప్రొసీడింగ్స్ అందాయి. వడ్డేపల్లిలో 1,967 దరఖాస్తులు రాగా 1,787కి ఫీజు చెల్లించాల్సి ఉండగా 378 మంది రూ.73 లక్షలు చెల్లించారు.304 మందికి ప్రొసీడింగ్స్ అందాయి.

సమ్మెబాట

- రేపటి నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె
- పీఆర్‌సీ బకాయిలు.. సమస్యల పరిష్కారమే ఎజెండా
- గద్వాల డిపో పరిధిలో 396 మంది కార్మికులు



గద్వాల పట్టణంలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

గద్వాల క్రైం: ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యారు. కార్మికుల సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ బకాయిల విడుదలే ప్రధాన ఎజెండాగా ఈ నెల 7వ తేదీ నుంచే సమ్మెబాట పట్టనున్నారు. టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ సమ్మెకు పిలుపునివ్వగా.. జిల్లా ఆర్టీసీ కార్మికులు వారి ఆదేశాల మేరకు సన్నద్ధమయ్యారు. గద్వాల డిపో పరిధిలో మొత్తం 396 మంది కార్మికులు ఉన్నారు. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో 2019లో ఆర్టీసీ కార్మికులు 54 రోజుల పాటు సమ్మె చేపట్టారు. ఆ సమయంలోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని నాటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారు. కానీ నేటికీ ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. దీనికితోడు కార్మిక సమస్యల పరిష్కారం, పీఆర్‌సీ బకాయిలు చెల్లింపు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చూస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ అమలు చేయకపోవడంతో సమ్మెబాట పట్టనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా సమస్యలు పట్టించుకోవడం లేదని పలువురు కార్మికులు ఆరోపించారు.

డిమాండ్లు..

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ, 2017 వేతన సవరణ బకాయిల చెల్లింపు, కొత్త అలవెన్స్‌ల అమలు, 2021- 2025 వేతన సవరణ చేయాలని కోరారు. అలాగే, ఉద్యోగ భద్రత సిబ్బందిపై పనిభారం తగ్గించాలని, ఆర్టీసీ అభివృద్ధికి ఏటా బడ్జెట్‌లో 3 శాతం నిధుల కేటాయించాలని, ఎలక్ట్రిక్ బస్సులను కేంద్రం ప్రభుత్వ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అర్హులకు పదోన్నతులు, కారుణ్యనియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, సీసీఎస్ నుంచి యాజమాన్యం వాడుకున్న డబ్బును వడ్డీతో సహా చెల్లించేలా చూడాలని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కన్సల్టెన్సీల పేరుతో ఉన్న వారి తొలగింపు, మహిళ కండక్టర్లతో పాటు ఉద్యోగుల సమస్యలు పరిష్కారం తదితర డిమాండ్లు జేఏసీ ప్రకటించిన జాబితాలో ఉన్నాయి.

సమస్యల పరిష్కారానికే..



జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నాం. కార్మికులకు రావాల్సిన అన్ని బకాయిలు చెల్లించడంతో పాటు ప్రధాన సమస్యలను పరిష్కరించాలి. పలుమార్లు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదు. తమ హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటానికి దిగుతున్నాం.

– రాంనాథ, కండక్టర్, గద్వాల డిపో

క్లుప్తంగా

మార్నింగ్ వాక్‌కు వెళ్లి అనంతలోకాలకు..


సుగుణమ్మ (ఫైల్)

గోపాల్‌పేట: మార్నింగ్ వాక్‌కు వెళ్లిన మహిళను మృత్యువు వెంటాడింది. ఈ ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని నర్సింగాయపల్లి సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్‌కుమార్ వివరాల మేరకు.. నర్సింగాయపల్లికి చెందిన రాకాసి సుగుణమ్మ (62), రాకాసి అనసూయమ్మ, మరికొందరు రోజు గ్రామం నుంచి సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు మార్నింగ్ వాక్ చేసేవారు. రోజు మాదిరిగానే సోమవారం కూడా అందరూ మార్నింగ్ వాక్‌కు వెళ్లగా.. వెనకాల నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం సుగుణమ్మ, అనసూయమ్మలను ఢీకొట్టింది. దీంతో సుగుణమ్మ రోడ్డుపై, అనసూయమ్మ రోడ్డు పక్కన పడిపోయారు. సుగుణమ్మ పైకి లేచే క్రమంలో మరో ద్విచక్ర వాహనం అతి వేగంగా ఢీకొట్టడంతో ఆమెకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య


అనిత మృతదేహం

మల్దకల్: కుటుంబ కలహాలు, భర్త వేధింపులు భరించలేక మహిళ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలోని మద్దెలబండ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా, కలిగిరి మండలంలోని వీరనకల్లు గ్రామానికి చెందిన అనిత (22) తన భర్తతో కలిసి మూడు నెలల క్రితం మద్దెలబండ గ్రామంలో జ్యూస్ షాపు నిర్వహించుకునేందుకు వలస వచ్చారు. రోజులాగే షాపు నిర్వహిస్తున్న అనిత సోమవారం భర్త హరికృష్ణ వేధింపులు భరించలేక మనస్థాపానికి గురైంది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన భర్త చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయమై పోలీసులను సంప్రందించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

యాచకుడి మృతి

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని గాంధీనగర్ అశోక్ టాకీస్ వద్ద సోమవారం ఓ యాచకుడు మృతిచెందాడు. ఎస్ఐ మాధవరెడ్డి వివరాల మేరకు.. వంగూర్ మండలం చౌదర్‌పల్లికి చెందిన శంకరప్ప (60) పదేళ్లుగా పట్టణంలో యాచిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోడ్లపైనే నిద్రిస్తూ.. దొరికిందల్లా తింటూ ఉండటంతో అతడికి అనారోగ్య సమస్యలతో పాటు ఎండ తీవ్రత తట్టుకోలేక చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తంచేశారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ట్రాక్టర్ కిందపడి ఇద్దరు బాలుర దుర్మరణం


వెంకటేష్(ఫైల్)


భరత్ (ఫైల్)

అమరచింత/గోపాల్‌పేట: వనపర్తి జిల్లాలో రెండు వేర్వేరు ట్రాక్టర్ ప్రమాదాల్లో ఇద్దరు బాలురు ప్రాణాల కోల్పోయారు. వివరాల్లోకి వెళితే.. తన తండ్రితోపాటు ట్రాక్టర్‌పై వెళ్తున్న బాలుడు వెంకటేష్ (12) ప్రమాదవశాత్తు అదే ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన ఘటన అమరచింత మండలంలోని సింగంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన వడ్డె శ్రీనివాసులు కుమారుడు వడ్డె వెంకటేష్ వ్యవసాయ పనులు ముగించుకొని ట్రాక్టర్‌పై ఇంటికి వస్తుండగా వెంకటేష్ ట్రాక్టర్‌పై నుంచి కిందపడ్డాడు. ట్రాక్టర్ ఆపేలోపే ట్రాక్టర్ టైర్ వెంకటేష్ తలపై నుంచి వెళ్లడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడు ఆత్మకూర్‌లోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 7వ తరగతి పూర్తి చేశాడు. వడ్డె శ్రీనివాసులుకు ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. ఉన్న ఒక్క కుమారుడు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బాలుడి మృతిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

■ రేవల్లి మండలం కేశంపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రేవల్లి ఎస్ఐ రజిత తెలిపిన వివరాల మేరకు.. కేశంపేటకు చెందిన శంకర్‌కు ఐదుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ఆదివారం రాత్రి పాతతండా రోడ్డులో ఉన్న తన పొలం వద్ద ఒడ్లు కప్పేందుకు శంకర్ ఇద్దరు కుమారులను తీసుకుని ట్రాక్టరుపై వెళ్లాడు. కవర్లు కప్పిన తర్వాత రాత్రి ఎన్నిమిదిన్నర సమయంలో ఇద్దరు కుమారులు రాజు, భరత్(10)లను ఇంటి పంపేందుకు వేరే డ్రైవర్ రాముడుకు ట్రాక్టర్ ఇచ్చి పంపాడు. ట్రాక్టర్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వాహనం రావడంతో డ్రైవర్ బ్రేకు వేశాడు. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న భరత్ టైరు కింద పడిపోగా, బాలుడి పైనుంచి ట్రాక్టరు ముందుకు వెళ్లింది. మళ్లీ చూడకుండా డ్రైవర్ ట్రాక్టర్ రివర్స్ తీయడంతో బాలుడి తలపై నుంచి టైర్ వెళ్లి తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. భరత్ గురుకుల ఎంట్రన్స్ రాయగా, ఆరో తరగతికి హైదరాబాద్‌లో సీటు వచ్చింది.

ఆధునిక సాగుకు ఆసక్తి


పెద్దవార్వాల్‌లో హార్వెస్టర్‌తో వరి కోత

- యంత్రాల వినియోగానికి మొగ్గుచూపుతున్న అన్నదాతలు
- తీరుతున్న ఇక్కట్లు.. సమయం, వ్యయం ఆదా

గండేడ్: వ్యవసాయంలో నాడు పశువులు, కూలీలు, ఎద్దులబండ్ల వినియోగం ఉండేది. సాగు అంటేనే సవాలక్ష సమస్యలతో కూడకున్న తరుణంలో యాంత్రీకరణ తోడుకావడం అన్నదాతల కష్టాలు తీరినట్లయింది. ప్రస్తుతం సాగులో చాలావరకు యంత్రాల వినియోగం పెరగడంతో కూలీల కొరత తీరడంతో పాటు సమయం, వ్యయభారం కూడా తగ్గుతోంది.

నాడు పశువులే కీలకం..

నాడు వ్యవసాయంలో దుక్కి దున్నడం మొదలు పంట కోసే వరకు పశువుల వినియోగమే ఎక్కువగా ఉండేది. కరిగెట్లు చేయడం, కోసిన పంటను కూడా ఎద్దులతోనే తొక్కించేవారు. కూలీలు నాటు వేయడం, కలుపు తీయడం, ధాన్యం నూర్పిళ్లు చేయడం చేసేవారు. కూలీలు ధాన్యాన్ని సంచుల్లో నింపితే ఎద్దులబండ్లలో మార్కెట్‌కు తరలించేవారు. గడ్డిని కూలీలు ఎదిరితే ఎద్దులబండ్లలో ఇళ్ల దగ్గరికి తెచ్చుకొనేవారు. కాని ఈ తంతు పూర్తయ్యే వరకు కనీసం వారం నుంచి పది రోజులు పట్టేది. ప్రతి ఇంటి వద్ద పశుసంపద పండటంతో పాడి ఉత్పత్తి కూడా మెరుగ్గా ఉండేది. రాను రాను సాంకేతికతకు అనుగుణంగా మార్పులు రావడంతో వ్యవసాయంలో యంత్రాల వినియోగం క్రమంగా పెరుగుతోంది.

అందుబాటులోకి బేలర్‌లు..

వరి పంట కోసిన తర్వాత గడ్డిని దగ్గరగా చేర్చేందుకు చాలా సమయం పట్టేది. కాని ఇటీవల గడ్డిని చుట్టే యంత్రం బేలర్ రావడంతో రైతుల బెంగ తీరింది. హార్వెస్టర్లు కోసిన గడ్డిని బేలర్ సునాయసంగా కట్టలు కడుతుంది. సాధారణంగా రైతులు వినియోగించే ట్రాక్టర్‌కు బేలర్‌ను హైడ్రాలిక్ సిస్టంతో అమర్చుతారు. ఈ యంత్రం గడ్డిని కట్టగా తయారు చేస్తోంది. గతంలో ఎకరా విస్తీర్ణంలో పశుగ్రాసానికి కుప్పగా మార్చడానికి కూలీలకు రూ.వేలు ఖర్చయ్యేది. బేలర్‌తో కట్టకు రూ.35 చొప్పున ఒకరోజులో పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం కట్టలు కడుతుంది. ఎకరాకు సుమారు రూ.1,800 మాత్రమే ఖర్చవుతుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా..

మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయంలో ప్రతీది యంత్రాలతోనే చేస్తున్నారు. కరిగెట్లు ట్రాక్టర్లు, రోటవేటర్లతో, కలుపు మందుల పిచికారీ యంత్రాలతో చేపడుతున్నారు. పండిన పంటలను సైతం కోయడానికి యంత్రాల ప్రాధాన్యం పెరిగింది. వరి కోత యంత్రాలు అతి తక్కువ సమయంలో పంట కోతలు చేపట్టడంతో పాటు గడ్డి, ధాన్యం వేర్వేరుగా వస్తున్నాయి. యంత్రాలను వినియోగించి తూర్పారబడుతున్నారు. ఒకేరోజు అన్ని పనులు పూర్తవుతుండటంతో రైతులకు వ్యయ భారం తగ్గడంతో పాటు సమయం ఆదా కావడం, డబ్బులు కూడా వెంటనే అందే పరిస్థితులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యంత్రాల వినియోగం పెరిగింది. పాత విధానంలో ఒక ఎకరా పంట శుభ్రం చేయడానికి తక్కువగా వారం రోజుల సమయం పడుతుండగా.. వరి కోత యంత్రమైతే ఒకే గంటలో పూర్తవుతుంది.


వెన్నాచేడ్‌లో యంత్రం ద్వారా ధాన్యం శుభ్రం చేస్తున్న రైతులు

గాలి కోసం ఎదురుచూడాల్సి వచ్చేది..



గతంలో పంట కోసి బంతులు తొక్కించి రాలిన ధాన్యాన్ని మదనం వేసేవాళ్లం. తర్వాత ధాన్యం తూర్పారబట్టడానికి గాలి కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. ప్రస్తుతం విద్యుత్ యంత్రాలతో గంటల్లోనే పని పూర్తవుతుంది. తూకం కూడా ఎలక్ట్రానిక్ కాంటాతో త్వరగా పూర్తి చేస్తున్నారు. – దండె రాములు, రైతు, వెన్నాచేడ్

యంత్రాలతో పని సులువు..



వరి కోత యంత్రంతో రెండు ఎకరాల పంట రెండు గంటల్లో పూర్తవుతుంది. గతంలో కోయడానికి ఒకరోజు, మోపులు కట్టడానికి ఒకరోజు, బంతులు తొక్కించడానికి ఒకరోజు ఇలా ధాన్యం తూర్పారబట్టే వరకు కనీసం మూడు నాలుగు రోజులు పట్టేది. గడ్డివాము వేయడానికి కూడా చాలా సమయం పట్టేది. యంత్రాల వినియోగంతో పనులు సులువుగా త్వరగా పూర్తవుతున్నాయి. – చల్ల శేఖర్, రైతు, వెన్నాచేడ్

వరిధాన్యం కొనుగోలులో కొర్రీలు


అడ్డాకుల మండలం పొన్నకల్‌లో ఆందోళనకు దిగిన రైతులు

- రోడ్డెక్కి ఆందోళనకు దిగిన అన్నదాతలు
- సకాలంలో ధాన్యం సేకరించడం లేదని ఆవేదన

అడ్డాకుల/నర్వ/వీపనగండ్ల/దామరగిద్ద: ఆరుగాలం కష్టించి పండించిన పంటను విక్రయించేందుకు అన్నదాతలు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు కొర్రీలు పెడుతూ.. ధాన్యం సేకరణ ప్రక్రియను నత్తనడకన సాగిస్తుండటంతో రైతన్నల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు.

■ అడ్డాకుల మండలంలోని పొన్నకల్‌లో ధాన్యం త్వరగా సేకరించడం లేదని రైతులు ఆందోళనకు దిగారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి రాచాల – మహబూబ్‌నగర్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అధికారులు సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడం తలకు మించిన భారంగా మారిందని వాపోయారు. రోజుకు ఒక లారీ వడ్లను మాత్రమే కొనుగోలు చేస్తున్నారని.. చాలా మంది రైతులు ధాన్యాన్ని ఆరబోసుకోని పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఎం. శ్రీనివాస్ పొన్నకల్‌కు చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. తహసీల్దార్ శేఖర్ ఫోన్ ద్వారా రైతులతో మాట్లాడి.. వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేస్తామని, అవసరమైతే ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

■ నర్వ మండలం రాంపూర్ గేట్ వద్ద రైతులు ధాన్యం వాహనాలను రహదారికి అడ్డుగా పెట్టి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మూడు, నాలుగు రోజులుగా ధాన్యం వాహనాలతో పడిగాపులు కాస్తున్నా మిల్లర్లు దించుకోవడం లేదని వాపోయారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

■ వీపనగండ్ల మండలం తూంకుంటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ధాన్యంలో తాలు పేరుతో 40 కిలోలకు అదనంగా 5 కిలోలు వేస్తేనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని నిర్వాహకులు అంటున్నారని రైతులు వాపోయారు. అధికారులు మిల్లర్లతో కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై ఏపీఎం బిచ్చన్నను వివరణ కోరగా.. కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యంలో అధిక శాతం తాలు ఉందని, తూర్పు పట్టి తాలును తొలగిస్తే కొనుగోలు చేస్తామని చెప్పామని వివరణ ఇచ్చారు.


దామరగిద్ద మండలం కాన్‌కుర్తి సమీపంలో..


వీపనగండ్ల మండలం తూంకుంట కొనుగోలు కేంద్రంలో రైతుల ధర్నా

■ దామరగిద్ద మండలం కాన్‌కుర్తి సమీపంలోని గుర్మిటకల్–కొడంగల్ ప్రధాన రహదారిపై ధాన్యం వాహనాలతో రైతులు ఆందోళనకు దిగారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని తరలించేందుకు సరిపడా లారీలు రాకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మిల్లర్లు తమకు ప్రభుత్వ గిడ్డంగులు కేటాయిస్తే ధాన్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటామని చెప్పడంతో అధికారులు గిడ్డంగులు ఇచ్చేందుకు అనుమతించారు. కాగా, గిడ్డంగి వద్ద వే బ్రిడ్జి లేకపోవడంతో సమీపంలోని కాటన్‌మిల్, కాన్‌కుర్తి, విఠలాపూర్ రైస్ మిల్లుల్లోని వే బ్రిడ్జ్‌ల్లో తూకం వేయించాలని అధికారులు నిర్ణయించారు. తీరా సదరు మిల్లర్లు వే బ్రిడ్జిలను ఇచ్చేందుకు ఇష్టంలేక పనిచేయడం లేదని చేతులెత్తేశారు. దీంతో రెండు రోజులుగా 164కి పైగా ధాన్యం వాహనాలు వేయింగ్ కోసం బారులు తీరాయి. దీన్ని నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగగా.. సీపీఎం నాయకులు మద్దతుగా పాల్గొన్నారు. సమాచారం అందుకున్న డీఎస్‌ఓ బాల్‌రాజ్, సివిల్ సప్లై డీఎం సైదులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.


నర్వ మండలం రాంపూర్ గేట్ వద్ద అన్నదాతల నిరసన

జడ్చర్ల బైపాస్‌కు పచ్చజెండా

- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ
- ఎంపీ డీకే అరుణతో కలిసి విన్నవించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: జడ్చర్ల సమగ్రాభివృద్ధిలో భాగంగా జడ్చర్ల బైపాస్ రోడ్డు నిర్మించాలన్న వినతిపై కేంద్ర రోడ్డు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి గడ్కరీని సోమవారం ఎంపీ డీకే అరుణతో కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. జడ్చర్ల–హైదరాబాద్ జాతీయ రహదారి నంబర్ 44ను కల్వకుర్తి–జడ్చర్ల జాతీయ రహదారి 167 నంబర్‌ను అనుసంధానం చేస్తూ బైపాస్ రోడ్డు నిర్మించాలని ఈ సందర్భంగా మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. పోలేపల్లి సెజ్, తదితర పరిశ్రమలతో కొలువుదీరిన జడ్చర్ల చుట్టు బైపాస్ నిర్మించడం వల్ల ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రెండు జాతీయ రహదారులను కలిపేందుకు కేవలం 4 కి.మీ.ల మేర రోడ్డు నిర్మిస్తే సరిపోతుందని తెలిపారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి అంగీకారం తెలపడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.

'ఏఐ'లో కందనూలుకు రాష్ట్రస్థాయి గుర్తింపు

- డీఈఓను అభినందించిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా


డీఈఓ రమేష్‌ను సన్మానించిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లాలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)తో కూడిన విద్యాబోధనకు 22 పాఠశాలల విద్యార్థుల ఆన్‌లైన్ నమోదు వంద శాతం పూర్తి చేశారు. దీంతో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన డీఈఓల సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి యోగితా రాణా జిల్లా డీఈఓ రమేష్‌కుమార్‌ను అభినందించి శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత విద్యా సంవత్సరంలో పైలట్ ప్రాజెక్టు కింద ఏఐతో కూడిన బోధనకు ఎంపిక చేసిన 22 పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల్లో చదువుతున్న 285 మంది విద్యార్థులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్థానంలో నిలిచింది. ఇందుకు కృషి చేసిన సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను డీఈఓ రమేష్‌కుమార్ అభినందించారు.

హిందూ ధర్మ పరిరక్షణే ముఖ్యం


మాట్లాడుతున్న ధర్మప్రసార సమితి రాష్ట్ర ప్రముఖ్ వెంకటేశ్వరరావు జాదవ్

ఎర్రవల్లి: హిందూ ధర్మం, సంస్కృతిని కాపాడేందుకు ప్రతి హిందువు పాటుపడాలని ధర్మప్రసార సమితి రాష్ట్ర ప్రముఖ్ వెంకటేశ్వరరావు జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కోదండరామస్వామి ఆలయంలో వివిధ మండలాలకు చెందిన ధర్మప్రసార సమితి సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరైన ఆయన విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధర్మ ప్రసార సమితి నిర్వహిస్తున్న వివిధ అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. హిందూ సమాజాన్ని ఏకం చేయడంతో పాటుగా సేవ చేయడం కోసం 1964లో వీహెచ్‌పీని స్థాపించినట్లు తెలిపారు. దీని ద్వారా 1966లో కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌లో హిందువుల ప్రపంచ సదస్సు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. అప్పటి నుంచి రాష్ట్రంలోని ప్రతి మండలంలో హిందూ సమాజం కోసం వీహెచ్‌పీతో పాటుగా ధర్మ ప్రసార సమితి కూడా అంతర్గత భాగమై పనిచేస్తూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. హిందూ దేవాలయాల పునరుద్ధరణ, నిర్మాణం కోసం సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత మార్పిడితో పాటు గోహత్యలను అడ్డుకుకోవాలని కోరారు. అనంతరం ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నె బాల సంస్కార కేంద్రానికి చెందిన చిన్నారులు శ్రీరామ వంశవృక్షం, హనుమాన్ చాలీసా, భగవద్గీత, ప్రార్థన శ్లోకాలు, గోవిందనామాలను కంఠస్థంగా వివరించారు. ప్రతిభను కనబర్చి చిన్నారులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహ ప్రముఖ్ బ్రహ్మానందగౌడ్. జిల్లా ప్రముఖ్ సత్యం, ఫణిమోహన్‌రావు, మదన్‌మోహన్, నర్సింహ, రాఘువేంద్ర, జగదీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు యువత పోరాడాలి


వేదికపై అభివాదం చేస్తున్న నాయకులు

మాగనూర్(మక్తల్): దేశ సమగ్రత కోసం యువత సంఘటితంగా పోరాడాలని ప్రొ. జగన్మోహన్‌సింగ్, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. సోమవారం మక్తల్‌లోని నారాయణపేట చౌరస్తా వద్ద భగత్‌సింగ్ విగ్రహాన్ని వారితో పాటు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కలిసి ఆవిష్కరించి అనంతరం నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. దేశ సామాజిక పరిస్థితుల్లో భగత్‌సింగ్ స్థాపించిన నవజవాన్ సభ క్రియాశీలక పాత్ర వహించిందన్నారు. భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. అనంతరం గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. బ్రిటీష్ వారి దుర్మార్గానికి బలైన త్యాగమూర్తి భగత్‌సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు కిరణ్, భాస్కర్, శారద, రాజు, ఆనంద్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అనుమతులు రద్దు చేయాలని ధర్నా


కొత్తపల్లిలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి శివారు నుంచి ఇసుక తరలింపునకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఇసుక రవాణాతో భూగర్భజలాలు తగ్గుతున్నాయన్నారు. దీంతో వ్యవసాయ బోరుబావులపై ఆధారపడి పంటలు పండిస్తున్న రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. రైతులను దృష్టిలో ఉంచుకొని ఇసుక అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుదర్శన్, బాలు, జంగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, కాడయ్య, బంగారు, నర్సింహారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్స్ చోరీలో ఐదుగురు అరెస్టు


మొబైల్స్ చోరీ చేసిన ఐదుగురితో ఎస్ఐ శ్రీనివాసులు

బిజినేపల్లి: మండల కేంద్రంలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తుల్ని పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మొబైల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి విచారించగా, ఈ దొంగతనాల్లో మరో నలుగురుని అరెస్టు చేసి వారి నుంచి 17 సెల్‌ఫోన్లు, ఒక స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. వారిలో ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కిరణ్‌దాసు, వంశీ దాసు, ఆవుల రోహణ్ ప్రధానంగా ఉండగా, హైదరాబాద్‌కు చెందిన హర్షవర్ధన్, కొత్తకోటకు చెందిన సాయి క్రిష్ణలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగం రాదనే భయంతో ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న యువకుడు

మదనాపురం: ఉద్యోగం రాదనే భయంతో మనస్థాపానికి గురై యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన సోమవారం మదనాపురం మండలంలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్ తెలిపిన కథనం ప్రకారం.. ఆత్మకూర్ పట్టణానికి చెందిన మహేష్ (22) ఈ మధ్యకాలంలో తమ సమీప బంధువులతో గొడవ జరిగింది. ఈ కారణంగా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఉద్యోగ అవకాశాలు రావని మనస్థాపానికి గురై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.